# రెండో పెళ్ళి

"ఈరోజు మా శ్రీమతి పుట్టినరోజు. నువ్వు రావాలోయ్" అన్నాడు శంకర్రావ్ శ్రీనివాసరావ్‌కు ఇన్విటేషను కార్డు అందిస్తూ. చాలా ఖరీదైన కార్డుమీద మెరుస్తున్న ఇంగ్లీషు అక్షరాలతో చాలా అందంగా ఉందాకార్డు. కునేగా సెంటువాసన గుప్పుమంది.

"ఈవినింగ్ ఫోర్‌కి పార్టీ ఉంది. తప్పకుండా వస్తావు కదూ?" అన్నాడు శంకర్రావ్.

"అలాగే" అన్నాడు శ్రీనివాసరావు.

"థాంక్యూ" స్టయిలిష్‌గా తల తిప్పుతూ అన్నాడు శంకర్రావు. బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

శంకర్రావ్ వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయాడు శ్రీనివాసరావు. శంకర్రావ్‌లో ఎంత ఫోజు, ఎంత స్టయిల్, ఎంత ఠీవి, ఎంత గర్వం వచ్చాయి? ఒకప్పటి తన రూమ్‌మేట్, క్లాస్‌మేట్ ఐన శంకర్రావుకి ఇప్పటి శంకర్రావుకి యేమైనా పోలిక ఉందా?

శంకర్రావు యిచ్చిపోయిన కార్డుకేసి చూసాడు. పుట్టినరోజుకి కూడా ఇంత హంగామా ఉంటుందా అనిపించింది. సినిమాల్లో తప్ప పుట్టినరోజులు ఇంత ఘనంగా జరుపుకోవటం తనెన్నడూ చూడలేదు.

సునీతాదేవి పరిచయమైన క్షణం నుండే శంకర్రావు స్టార్ తిరిగిపోయింది. శంకర్రావు తన ఊరివాడే. శంకర్రావ్ తల్లిదండ్రులు చాలా పేదవాళ్ళు. మొదట్లో శంకర్రావు తండ్రి రామయ్య, శ్రీనివాసరావు తండ్రి గోవిందరావు దగ్గర జీతానికి ఉండేవాడు. గోవిందరావు వాళ్ళ ఊళ్ళో మాంచి మోతుబరిరైతు. ఆ ఊరి హైస్కూల్లోనే శ్రీనివాసరావు, శంకర్రావు (ఆరోజుల్లో శంకర్రావును 'శంకరీ' అని పిల్చేవాళ్ళు) ఇద్దరూ ఒకే క్లాసులో కలిసి చదువుకున్నారు. శంకర్రావ్‌కు పుస్తకాలు గాని, నోటుబుక్స్ గాని, కంపాసు పెట్టెగాని యేవీ ఉండేవి కావు. శ్రీనివాసరావే శంకర్రావుకు యివన్నీ యిస్తుండేవాడు. శంకర్రావు తండ్రి రామయ్య శ్రీనివాసరావును ఎప్పుడూ బ్రతిమాలుతూ ఉండేవాడు, యేదోలా తన కొడుకు చదువుకునేలా చూడమని. తన కొడుకును పెద్ద చదువులు చదివించాలన్న రామయ్యలోని పట్టుదల గోవిందరావును, శ్రీనివాసరావును ఆకర్షించింది.

హైస్కూల్లో ఎప్పుడూ ఇద్దరికి మంచి మార్కులు వస్తుండేవి. శంకర్రావు చదువులో చాలా చురుకైనవాడే. ముఖ్యంగా లెక్కల్లో అతనిది ఆమోఘమైన బుర్ర.

శ్రీనివాసరావు, శంకర్రావు ఇద్దరూ కలిసి గంటలకి గంటలు లెక్కలు చేసుకునేవాళ్ళు. ఇద్దరూ ఒకరికి రాకపోతే మరొకరు చెప్పుకునేవాళ్లు.

ఇద్దరూ ఫస్టుక్లాసులో 12వ తరగతి ప్యాసయ్యారు. శ్రీనివాసరావును బి.ఇ.లో చేర్పించదలచినట్లు చెప్పాడు గోవిందరావు.

"చచ్చి మీ కడుపున పుడతాను. మావాడ్నికూడా శ్రీనివాసరావు గారితో పాటే చేర్పించి రండి" అంటూ ఎంతో బ్రతిమాలాడు రామయ్య.

"బి.ఇ.లో చేర్పించటం అంటే ఈ ఊరి హైస్కూల్లో చదివించటం కాదు. వేలకు వేల డబ్బు ఖర్చవుతుంది. అంత డబ్బు ఎక్కడనుండి తేగలవు రామయ్యా?" అన్నాడు గోవిందరావు.

"పట్నంలో శ్రీనివాసరావుగారి చేతికింద ఉండి వారే పని చెపితే ఆ పని చేస్తుంటాడు మావాడు. వారితోపాటే మావాడ్ని ఉంచండి. వాడు మీకు రెండోకొడుకు అనుకోండి - మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను బాబూ" అన్నాడు రామయ్య.

"సరే, తిండీ, ఇల్లూ, గుడ్డలు మొదలయినవన్నీ మావాడితో వుంచితే ఎలాగో ఇద్దరూ సర్దుకుంటారనుకో- కాని పుస్తకాలు, కాలేజి ఫీజులు వీటికే అవుతుంది బోలెడు ఖర్చు" అన్నాడు గోవిందరావు.

"వాటికోసం ఎంత అప్పైనాచేసి వాడ్ని చదివిస్తాను బాబూ. చదువు పూర్తిచేశాక వాడే యేదన్నా ఉద్యోగం చేస్తూ ఆ అప్పు తీర్చుకుంటాడు. ఏమైనాసరే, రేపు మీ శ్రీనివాసరావు గారితో మావాడ్ని తీసికెళ్ళండి బాబూ!" అన్నాడు రామయ్య.

"మీవాడు అదృష్టవంతుడు రామయ్యా! నువ్వేమీ చదువుకోకున్నా ఆర్థికంగా నీ పరిస్థితి యేమీ బాగా లేకపోయినా మీవాడ్ని మేమే భయపడే పెద్ద చదువులు చదివించడానికి యింత పట్టుదల చూపుతున్నావు. వాడు రేపు నిన్ను యేం ఉద్ధరిస్తాడో చూడాలి!" అన్నాడు గోవిందరావు.

రామయ్య తనకున్న రెండెకరాల భూమిని తాకట్టుపెట్టి కొంత అప్పుతెచ్చాడు. గోవిందరావు కూడా రామయ్యకు కొంత అప్పు ఇచ్చాడు. ఎలాగైతేనేమీ, శంకర్రావు కూడా శ్రీనివాసరావుతో పాటు బి.ఇ.లో చేరాడు.

శ్రీనివాసరావు శంకర్రావ్‌కు ఎన్నో విధాల సాయపడేవాడు. శ్రీనివాసరావుకు ఇంటినుండి కావల్సిన దానికంటే కొంచెం ఎక్కువ డబ్బే వస్తుండేది. ఆ డబ్బు ఇద్దరూ ఖర్చుపెడ్తుండేవాళ్లు. శ్రీనివాసరావు ప్యాంట్స్, షర్ట్స్ కూడా శంకర్రావు ఫ్రీగా వేసుకొని తిరిగేవాడు. పుస్తకాలకి, ఇంజనీరింగ్ పరికరాలకు కావల్సిన డబ్బుకూడా శ్రీనివాస రావు యిస్తుండేవాడు. కలిసే హోటళ్ళకీ, సినిమాలకీ వెళ్ళేవాళ్ళు.

ఆరోజుల్లో శంకర్రావు చాలా అమాయకంగా, దీనంగా కన్పించేవాడు. చాలా మితభాషి. ప్రపంచాన్ని చూసి భయపడ్తున్నవాడిలా ఎప్పుడూ బిక్కమొహం వేసికొని తిరిగేవాడు. శ్రీనివాసరావుతో కూడా ఎక్కువ మాట్లాడేవాడుకాదు. ఏది అడిగేవాడు కూడాకాదు. శ్రీనివాసరావు తనంతట తానుగా యిస్తే తీసుకునేవాడు. స్టడీస్ విషయంలో మాత్రం అత్యంత శ్రద్ధ కనబరచేవాడు.

పట్నానికి వచ్చిన రెండు మూడేళ్ళ తర్వాత శంకర్రావు నెమ్మదిగా మారసాగాడు. పట్నపునీళ్ళు, పట్నవాసపు జీవితం అతనికి బాగా కలిసొచ్చాయి. మనిషి కొంచెం పచ్చబడ్డాడు. ఇదివరకు ఈకలా ఉండేవాడు. కొంచెం వళ్ళుచేశాడు. మొదట్లో అలంకరణ మీదగాని, దుస్తుల మీదగాని ఎలాంటి శ్రద్ధ చూపని శంకర్రావు నెమ్మదిగా రోజుకు మూడుసార్లు సబ్బుతో మొహం కడగటం, స్నోలు, పౌడర్లూ మొహంమీద పులుముకోవటం, అద్దంలో పదేపదే చూసుకోవటం, క్రాపింగ్‌మీద, దుస్తులమీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం మొదలయినవన్నీ చేయటం సాగించాడు. దాంతో శంకరరావు మంచి అందగాడిగా మారిపోయాడు.

బి.ఇ.లో చేరిన రెండో సంవత్సరంలోనే శంకర్రావుకు స్కాలర్‌షిప్పుకూడా వచ్చింది! ఒక సంవత్సరానికి కావల్సిన ఖర్చంతా ఆ స్కాలర్‌షిప్పుతో సరిపోయింది. స్కాలర్‌షిప్పు చేతిలో పడ్డప్పటినుండి శంకర్రావులోని ఆత్మవిశ్వాసం బాగా పెరిగింది.

చిన్ననాటినుండి శ్రీనివాసరావు, శంకర్రావులు కలిసే ఉంటున్నా ఇద్దరి మధ్య ఒక ఆత్మీయతగాని, శాశ్వతమయిన స్నేహబంధంగానీ ఎన్నడూ యేర్పడలేదు. ఎన్నడైనా పొడిగా నాలుగు మాటలు మాట్లాడుకోవటం, స్టడీస్‌కు సంబంధించిన విషయాలు చర్చించుకోవటం తప్ప ఇద్దరిమధ్య మరేవిధమైన అనుబంధం యేర్పడలేదు. వయస్సు పెరుగుతున్నకొద్దీ ఇద్దరూ యింకా దూరమయ్యారు. ఇద్దరిమధ్య ఆర్థిక అసమానతలవల్ల ఏర్పడిన గోడల్ని వారు దాటలేకపోయారు.

తను, తన కుటుంబం శంకర్రావుకు ఎన్నోవిధాల సాయపడ్తున్నా శంకర్రావు తమపట్ల యెలాంటి కృతజ్ఞతను కనబరచకపోవటం అప్పుడప్పుడు శ్రీనివాసరావుకు ఆశ్చర్యం కల్గిస్తుండేది. శ్రీనివాసరావు కుటుంబం చేసిన సాయంవల్లనే తాను పైకి రాగల్గానని శంకర్రావు యెప్పుడూ అనేవాడు కాదు. ఎవ్వరితోనూ చెప్పేవాడు కాదు. శ్రీనివాసరావు కుటుంబం నుండి తను సహాయాన్ని పొందటాన్ని ఒక హక్కుగా మాత్రం చూసినట్టున్నాడు శంకర్రావు.

శంకర్రావులోని ఈ మనస్తత్వం శ్రీనివాసరావుకు రోజురోజుకు చిరాకు కల్గించసాగింది. తనకు తెలియకుండానే అతన్ని చీదరించుకోవటం మొదలుపెట్టాడు.

ఒకటి రెండుసార్లు చాలామంది తమ క్లాస్‌మేట్స్ ముందు శంకర్రావును అనుకోకుండా అవమానపరచటం కూడా జరిగింది.

శంకర్రావు తొడుక్కున టెర్లిన్ షర్టుమీద తమ క్లాస్‌మేట్ ఒకడు చూడకుండా యింక్ దులపరించాడు.

"సారీ బ్రదర్... నువ్వక్కడ వున్నావని తెలియదు. షర్టు పాడైనట్టుందే" అన్నాడతడను. శంకర్రావు ఆ విషయాన్ని యేమంత పట్టించుకోనట్లుగా

"ఫరవాలేదు - ఇట్స్ ఆల్‌రైట్" అన్నాడు. తనకెందుకో వళ్ళుమండింది. శంకర్రావు తొడుక్కొన షర్టు తనది.

"ఆ షర్టు అతనిదైతేగా అతనికి బాధ" అన్నాడు శ్రీనివాసరావు. శంకర్రావు ముఖం వెలవెలబోయింది. అలా ఎందుకన్నానా అని శ్రీనివాసరావు తర్వాత బాధపడ్డాడు. రూమ్‌కొచ్చాక శంకర్రావుతో "ఐ యామ్ సారీ" అని కూడా అన్నాడు.

స్కాలర్‌షిప్పు వచ్చినప్పటి నుండి శంకర్రావు శ్రీనివాసరావు మీద ఆధారపడటం చాలావరకు తగ్గించేసాడు. తన డబ్బుతోనే చాలా ఖరీదైన దుస్తులు కొనుక్కోవటం, విలువైన స్నోలు, పౌడర్లు వాడటం, సాయంకాలం సిటీకి షికారుకు వెళ్ళటం - యివన్నీ ఎక్కువయ్యాయి. సెలవుల్లో కూడా ఇంటికి వెళ్ళకపోవటం, వాళ్ళ తల్లిదండ్రుల్ని గూర్చి యేమీ పట్టించుకోకపోవటం కూడా శంకర్రావులో ప్రారంభమయింది.

శ్రీనివాసరావు తన లోకంలో తానుండేవాడు. శ్రీనివాసరావుకు సాహిత్యం మీద మంచి అభిరుచి యేర్పడింది. ఆ లోకానికి చెందినవాళ్ళే అతనికి మిత్రులయ్యారు. ఇంగ్లీషు, తెలుగు నావెల్స్, పొయిట్రీ చదవటం, వాటినిగూర్చి చర్చించుకోవటం - తీరిక సమయాలన్నీ యిలాగే గడిపేవాడు శ్రీనివాసరావు.

ఇలా క్రమక్రమంగా శంకర్రావు, శ్రీనివాసరావులు దూరమైపోయారు. బి.ఇ. ఫైనలియర్‌లో తను వేరే రూమ్‌లోకి మారుతున్నట్లు తెలియజేసాడు శంకర్రావు, వద్దనలేదు శ్రీనివాసరావు.

ఆతర్వాత శంకర్రావును గూర్చి శ్రీనివాసరావుకు తెలిసింది చాలా తక్కువ. శంకర్రావు ఉమెన్స్ కాలేజిలో బి.ఏ. చదువుతున్న 'సునీత' అనే అమ్మాయిని ప్రేమించాడని. ఆమె కూడా యితన్ని ప్రేమించిందని ఎవరో తన క్లాస్‌మేట్స్ చెప్పగా విన్నాడు. సునీత తండ్రి లక్షాధికారి అనీ త్వరలో శంకర్రావు, సునీత పెళ్ళిచేసుకోబో తున్నారని కూడా తెలిసింది.

శంకర్రావు బి.ఇ. ఫైనల్ ఇయర్ పరీక్షలయిపోవటంతో అతనికి సునీతాదేవికి వైభవంగా పెళ్ళయిపోయింది.

తన పెళ్ళికి రమ్మని శంకర్రావు తనకో ఇన్విటేషన్ కార్డయినా పంపించక పోవటం శ్రీనివాసరావును ఆశ్చర్యపరచలేదు. తల్లిదండ్రులకే తన పెళ్ళి విషయం చెప్పనివాడు, తల్లిదండ్రులనే పూర్తిగా మరచిపోయినవాడు తనను మరచిపోవటం వింతేమీ కాదు. పెళ్ళి అయ్యాక శంకర్రావు తన ఊరితోను, తన తల్లిదండ్రులతోను సంబంధాన్ని శాశ్వతంగా వదులుకున్నాడు.

శ్రీనివాసరావును ఎప్పుడు చూసినా కంటతడి పెట్టుకునేవాడు రామయ్య. "వాడు చదివి పెద్ద ఉద్యోగాలు చేసి మమ్మల్ని అదుకుంటాడని మురిసిపోయాను. యింత అన్యాయం చేస్తాడనుకోలేదు" అంటూ భోరున యేడ్చేవాడు. శ్రీనివాసరావు తండ్రి గోవిందరావు రామయ్యను ఎలాగో ఓదార్చి పంపిస్తుండేవాడు.

బి.ఇ. రిజల్ట్సు వచ్చాయి. శ్రీనివాసరావు, శంకర్రావు ఇద్దరూ ప్యాసయ్యారు. శంకర్రావుకు వెంటనే ఉద్యోగం దొరికింది. శంకర్రావు మామ లక్షాధికారి మాత్రమే కాదు, రాజకీయంగా చాలా పలుకుబడి ఉన్నవాడు. అందువల్ల శంకర్రావు ప్యాసయినట్లు తెలిసిన మరుక్షణంలోనే అతనికి ఉద్యోగం యిప్పించగల్గాడు.

ఉద్యోగం కోసం శ్రీనివాసరావు కొంతకాలం తంటాలుపడ్డాడు. ఈలోగా శ్రీనివాసరావుకు పెళ్ళికూడా అయ్యింది. శ్రీనివాసరావు బి.ఇ.లో ఉండగానే చాలా పెద్ద ధనవంతులు పిల్లనిస్తామని వచ్చారు. 50 వేల వరకూ కట్నం యిస్తామన్నారు. కట్నం తీసికోవటం పెద్ద నేరమని, కట్నం కారణంగా ఎంతోమంది స్త్రీల జీవితాలు నాశనమైపోతున్నాయని శ్రీనివాసరావు పుస్తకాల్లో చదివాడు. కట్నం తీసికోవటం అన్యాయమని స్నేహితులతో వాదించేవాడు. కట్నం తీసికోకుండా పెళ్ళిచేసికోవాలనే ఒక ఆదర్శం అతనిలో నాటుకుపోయింది. వాళ్ళ నాన్నతో చెప్పాడు. "ఎవరైనా నాకు నచ్చిన పేదింటి అమ్మాయినే చేసుకుంటాను. కట్నం గిట్నం మనకొద్దు నాన్నా" అని. వాళ్ళ నాన్నకూడా "అలాగే కానివ్వు. మనకున్న ఆస్తిని చక్కగా నిలబెట్టుకుంటే చాలు. మరొకడి ఆస్తి మనకేమీ అక్కర్లేదు" అన్నాడు.

శ్రీనివాసరావు ఒకసారి యేదో పెళ్ళి సందర్భంలో తమ బంధువుల యింటికి వెళ్ళినపుడు సుశీలను చూసాడు. ఆ అమ్మాయిలో ఉన్న నిరాడంబరమైన అందం అతన్ని ఆకర్షించింది. అందం కంటే ఆ అమ్మాయి మొహంమీద కన్పించిన అతనికెంతో యిష్టమైన అమాయకత్వం శ్రీనివాసరావును అమితంగా ఆకర్షించింది. సుశీల తమ బంధువుల అమ్మాయి. వాళ్ళు ఉన్నవాళ్ళేమీ కాదు. సుశీల పెద్దగా చదువుకోలేదు కూడా. పైసా కట్నం తీసికోకుండానే శ్రీనివాసరావు సుశీలను పెళ్ళిచేసుకున్నాడు.

బి.ఇ. ప్యాసయ్యాక, మూడు నాల్గు నెలలు ఇంటర్వ్యూలకు తిరిగాక శ్రీనివాసరావుకు ఖమ్మంలో జూనియర్ ఇంజనీర్‌గా అపాయింట్‌మెంట్ వచ్చింది.

వచ్చి జాయిన్ అయ్యాడు. సుశీలను కూడా తీసుకువచ్చాడు. జీవితం హాయిగానే గడచిపోయినట్లనిపించింది.

శంకర్రావు యే ఊళ్ళో పనిచేస్తున్నాడో ఎలా ఉన్నాడో శ్రీనివాసరావుకు తెలియదు. కాని ఒకరోజు ఈ ఊరికే, తన ఆఫీసుకే శంకర్రావు అసిస్టెంట్ ఇంజనీర్‌గా ప్రమోటై వస్తున్నాడని తెలిసినప్పుడు శ్రీనివాసరావు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఎంతో ఇన్‌ఫ్లూయెన్స్ ఉంటేగాని యింత త్వరగా ప్రమోషన్ దొరకదు. ఒకప్పుడు తనమీద ఎంతో ఆధారపడిన శంకర్రావు ఇప్పుడు తనమీది అధికారిగా రావటం శ్రీనివాసరావును చాలా కలవరపరిచింది. తనలోపల యేదో అగ్ని రాజుకోవటం మొదలైంది.

శంకర్రావు శ్రీనివాసరావు పనిచేస్తున్న ఆఫీసులోనే అసిస్టెంట్ ఇంజనీర్‌గా జాయిన్ అయ్యాడు. శంకర్రావు యిప్పుడు ఇంకా మారాడు. బాగా లావెక్కాడు. ఎరుపెక్కాడు, చాలా ఖరీదైన దుస్తులు. ఇంట్లో ఒక బొచ్చుకుక్క. 30 వేలు ఖరీదు చేసే కారు. వాళ్ళ మామగారు కొనిచ్చారట, చాలా హుందాగా నడిచేవాడు. శంకర్రావు అంటే ఆఫీసులో అందరికి హడల్ - బాగా డబ్బున్నవాడు అనే గౌరవం కూడా.

శంకర్రావు శ్రీనివాసరావుతో అసలు మాట్లాడేవాడు కాదు. ఆఫీసుకు శంకర్రావు వచ్చిన మొదటిరోజు అందరితోపాటే శ్రీనివాసరావును కూడా అతనికి పరిచయం చేశారు.

"ఓ! నువ్వుకూడా యిక్కడే ఉంటున్నావా! వెరీ గ్లాడ్ టు సీయూ" అన్నాడు స్టైలిష్‌గా. అంతే! ఆ తర్వాత మళ్ళా ఎప్పుడూ శంకర్రావు శ్రీనివాసరావును పలకరించలేదు.

ఇవ్వాళ శంకర్రావు స్వయంగా వచ్చి "ఈరోజు మా శ్రీమతి పుట్టినరోజు. నువ్వు తప్పకుండా రావాల"ని చెప్పటం శ్రీనివాసరావును చాలా ఆశ్చర్యపరచింది. తన పెళ్ళికి కూడా ఇన్విటేషన్ కార్డు పంపించని శంకర్రావు తన భార్య పుట్టినరోజుకు రమ్మని పిలవటం చిత్రంగానే ఉంది.

"వెళ్దామా! వద్దా" అని కొంచెంసేపు ఆలోచించాడు. లక్షాధికారి కూతురు శంకర్రావు భార్య సునీతాదేవి ఎలా వుంటుందో చూడాలనిపించింది. వెడదామనే నిర్ణయించుకున్నాడు. మూడింటికే ఇంటికి వెళ్ళాడు. తన స్నేహితుడి భార్య పుట్టినరోజు పార్టీకి వెడ్తున్నానని సుశీలతో చెప్పాడు!

"ఉత్త చేతుల్తో వెడ్తారా? ఏదన్నా ప్రెజెంట్ పట్టుకెళ్ళండి" అని సూచించింది సుశీల.

"గుడ్ ఐడియా" అని సుశీలను మెచ్చుకున్నాడు.

## 2

మొహం కడుక్కొని, తనకున్నవాట్లో కాస్త మంచి బట్టలు వేసుకొని బజార్లో పడ్డాడు. ఒక షాప్‌కెళ్ళి 50 రూపాయల ఖర్చుతో ఒక అందమైన నిర్మల్ పెయింటింగ్ కొన్నాడు. "ఈ ప్రెజెంట్ చూసి సునీతాదేవి మురిసిపోతుంది. తను మంచి టేస్ట్ ఉన్నవాడు అనుకుంటుంది. 50 రూపాయలు పోతేపోయినాయి" అనుకున్నాడు.

రిక్షా యెక్కి శంకర్రావు యింటికి బయల్దేరాడు. శంకర్రావు యింటికి చేరేటప్పటికి సరిగ్గా నాలుగు గంటలయింది. శంకర్రావు ఉంటున్నది చాలా పెద్ద మేడ, చాలా అందమైన మేడ. అద్దె 200 రూపాయలట. అప్పుడే బయట నాలుగైదు కార్లు నిలిచి ఉన్నాయి. శ్రీనివాసరావు రిక్షా దిగుతుండగానే మరో కారు వచ్చి ఆగింది. అందరూ అలా కార్లలో వస్తుంటే తను రిక్షాలో రావటం చూశాక తనకిక్కడ స్థానం లేదేమోననిపించింది. కార్లోంచి జిల్లా కలెక్టర్, అతని భార్య దిగారు. వాళ్ళని దూరం నుంచే చూసిన శంకర్రావు పరుగెత్తుకుంటూ వచ్చి వాళ్ళను రిసీవ్ చేసుకున్నాడు. అక్కడే వున్న శ్రీనివాసరావును అతడు పట్టించుకోనేలేదు. వాళ్ళు ముగ్గురూ లోపలికి వెళ్ళాక నెమ్మదిగా శ్రీనివాసరావు డ్రాయింగ్‌రూమ్‌లో అడుగు పెట్టాడు. కళ్లు జిగేలుమనిపించేలా మెరిసిపోతున్నది ఆ గది. రంగురంగుల పూల తోరణాలతో చాలా అందంగా అలంకరించారు. పెద్దపెద్ద రంగు రంగుల సోఫాల్లో ఆ ఊర్లో బాగా పేరున్న పెద్ద పెద్ద అతిథులంతా హుందాగా కూర్చున్నారు. అంతా తమ తమ భార్యలతో వచ్చారు. ఆ ఊళ్లోని టాప్ ఆఫీసర్లంతా ఆ గదిలో కూర్చున్నారు.

తనని చూడగానే శంకర్రావు లేచి వచ్చి "హల్లో శ్రీనివాస్-రా... కూర్చో... ఒక్కడివే వచ్చావా? మీ శ్రీమతిని కూడా తీసుకురాలేకపోయావా?" అన్నాడు. శ్రీనివాసరావు నవ్వి ఊరుకున్నాడు. ఖాళీగా ఉన్న ఓ కుర్చీలో కూర్చున్నాడు. శంకర్రావు యింకేమీ మాట్లాడలేదు. అక్కడున్న వాళ్ళను అతనికి పరిచయం చేయలేదు. అక్కడ కూర్చున్న వాళ్ళతో కొంతమందినైనా గుర్తించగల్గాడు శ్రీనివాసరావు. ఎస్.పి., ఎస్.పి. భార్య, ఆర్.డి.వో. అతని భార్య, తహసిల్దార్, అతనిభార్య, జిల్లా కలెక్టర్, అతని భార్య - తనను తప్ప తమ ఆఫీసువాళ్ళను ఎవర్నీ పిలిచినట్టు లేదనుకున్నాడు. వాళ్ళందర్నీ చూస్తోంటే మరోసారి తనకిక్కడ స్థానం లేదనిపించింది శ్రీనివాసరావుకు.

శంకర్రావు ఎస్.పి.తోను, ఎస్.పి. భార్యతోను, కలెక్టర్‌తోనూ, కలెక్టర్ భార్యతోనూ చాలా హుషారుగా మాట్లాడుతున్నాడు. అంతా అటే చూస్తున్నారు. శంకర్రావు ఏదో జోక్ చేశాడు. అంతా గొల్లుమని నవ్వారు. ఎస్.పి. భార్య శివమెత్తినట్లుగా ఊగిపోతూ పగలబడి నవ్వుతోంది.

ఇంతలో మరో రెండు మూడు కార్లు వచ్చాయి. శంకర్రావు హడావుడిగా లేచి ఆ కార్ల దగ్గరకెళ్ళి వాళ్ళను రిసీవ్ చేసుకున్నాడు. మరో మూడు జంటలు డ్రాయింగ్ రూమ్‌లో ప్రవేశించాయి. మల్లెపూల వాసనలు ఆ గదినిండా గుప్పుమన్నాయి. "హల్లో"లతో "హౌ డు యు డూ"లతో గదంతా ప్రతిధ్వనించింది. శంకర్రావు మాత్రం కాలుగాలిన పిల్లిలా ఒక చోటినుండి యింకోచోటుకు హడావిడిగా తిరుగుతున్నాడు.

శ్రీనివాసరావుకు మాత్రం నిప్పులమీద కూర్చున్నట్లుగా ఉంది. తనను పట్టించుకున్నవాళ్ళే లేరు. చాలా ఒంటరిగా ఫీలయ్యాడు. వెళ్లిపోదామనుకున్నాడు. కాని తను వచ్చింది శంకర్రావు భార్య, లక్షాధికారి బిడ్డ సునీతాదేవిని చూడటానికి. సునీతాదేవిని చూసి తను తెచ్చిన ప్రెజెంట్ ఆమెకు అందజేసాకగాని వెళ్ళకూడదను కున్నాడు.

అలా ఒక గంటన్నరసేపు వెయిట్ చేశాక సునీతాదేవి వచ్చింది. అప్సరసలా వచ్చింది. అనితరసాధ్యమైన అద్భుత సౌందర్యంతో ఆ గదిలో వున్నవాళ్ల కళ్లు జిగేలుమనిపించింది. ఎవరో పెద్ద హాలివుడ్ ఫిల్మ్‌స్టార్‌ని చూసినట్టుగా ఫీలయ్యాడు శ్రీనివాసరావు. సునీతాదేవి నిరుపమాన సౌందర్యంతో ప్రకాశిస్తోంది. ఎన్ని గంటలో కూర్చొని చేసికున్న ఆమె అలంకరణ ఆమె సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసింది.

ఆమె కట్టుకున్న మెరూన్ కలర్ పట్టుచీర, అదేరంగు స్లీవ్‌లెస్ జాకెట్ వెలుగుల్ని విరజిమ్ముతున్నాయి. సునీతాదేవి మామూలు స్త్రీలా అనిపించలేదు. కలలో కూడా ఊహించనంతటి జగన్మోహన రూపం సునీతాదేవిది. సునీతాదేవిని చూసినవాడు విశ్వరూపాన్ని చూసిన కళ్లతో మరి యే యితర వస్తువుని చూడలేని విపరీత స్థితిలో పడతాడు. సునీతాదేవిని చూడగానే అంతా "హియర్" "హియర్" అంటూ పెద్దగా చప్పట్లుకొట్టి స్వాగతం పలికారు. కళ్ళతోనే నవ్వుతూ - గొప్ప కాంతితో వెలుగుతున్న ఆమె విశాలమైన కళ్లతోనే నవ్వుతూ వచ్చింది సునీతాదేవి. అతి వొయ్యారంగా నడిచివచ్చింది. అతి నాజూకుగా మాట్లాడింది. ఆమె మాటలాడినప్పుడు ఎవరో సున్నితంగా వీణ మీటుతున్నట్టనిపించింది. ఆమె పక్కనే శంకర్రావు... వెయ్యి క్యాండిళ్ళ బల్బు ముందు జీరో కాండిల్ బల్బులా అంతర్ధానమైపోయాడనిపించింది. శంకర్రావు సునీతాదేవికి ఒక్కొక్కర్నీ పరిచయం చేయటం మొదలుపెట్టాడు. శంకర్రావు ఈ ఊరు వచ్చాక టౌన్‌లోని ఆఫీసర్స్‌నందర్నీ పరిచయం చేసికోవటానికే ఈ పార్టీ అరేంజ్ చేశాడు. "హల్లో! హౌ డుయు డూ" అంటూ అందర్నీ వొయ్యారంగా పలకరించింది సునీతాదేవి.

సునీతాదేవి మీదినుండి తన కళ్లను మరలించుకోలేకపోయాడు శ్రీనివాసరావు. తన్ను తాను పూర్తిగా మరచిపోయి ఎక్కడో మరో ప్రపంచంలో విహరించాడు. సునీతాదేవిని శ్రీనివాసరావుకు పరిచయం చేశాడు శంకర్రావు.

"హీ ఈజ్ మిస్టర్ శ్రీనివాసరావు – వన్స్ హీ వజ్ మై క్లాస్‌మేట్... ప్రస్తుతం మన ఆఫీసులోనే జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు" అన్నాడు శంకర్రావు. అందరిలా తనతోకూడా అలాగే వొయ్యారంగా "హల్లో... హౌడుయుడూ" అంటుందను కున్నాడు శ్రీనివాసరావు.

"మన ఆఫీసులోనే జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు" అన్న మాట వినగానే సునీతాదేవిలోని వయ్యారమంతా విసుగ్గా మారింది. "ఓస్! ఇంతేనా!" అన్నట్టుగా ఆమె శ్రీనివాసరావువైపు చూసిన ఆ చూపు శ్రీనివాసరావు గుండెల్లో వాడిబాణంలా గుచ్చుకుంది. ఆ చూపులో ఎంత దర్పం, ఎంత పొగరు, ఎంత నిర్లక్ష్యం!

"గ్లాడ్ టు సీ యూ" పొడిగా అనేసి తనదగ్గర నుండి కదిలింది. శ్రీనివాసరావుకు తల కొట్టేసినట్లనిపించింది. అందరూ తమ తమ ప్రెజెంట్స్‌ని సునీతాదేవి పక్కనే నడుస్తున్న వాళ్ళ సర్వెంట్‌కు అందజేస్తున్నారు. శ్రీనివాసరావ్ తను తెచ్చిన ప్రెజెంట్ కూడా ఆ సర్వెంట్‌కే అందజేశాడు. ప్రజెంట్ అందజేసిన అందరికి థాంక్స్ చెప్పిన సునీతాదేవి తన ప్రెజెంట్‌కేసి చూడనైనా చూడకపోవటం శ్రీనివాసరావ్‌కు పుండుమీద కారం జల్లినట్లయింది.

ఇంతలో అంతా మరో గదిలోకి కదలసాగారు. శ్రీనివాసరావు అలాగే నిలుచున్నాడు. మరో గదిలోనుండి "హాపీ బర్త్‌డే టు యూ... హాపీ బర్త్‌డే టూ యూ" అంటూ అందరూ చప్పట్లు కొడుతూ పాడటం విన్పిస్తోంది. శ్రీనివాసరావుకు యిక ఆ ఇంట్లో ఉండాలనిపించలేదు. "హాపీ బర్త్‌డే టు యూ"లు మిన్నుముట్టాయి. విసురుగా బయటకు కదిలాడు శ్రీనివాసరావు.

## 3

రాత్రి తొమ్మిదిగంటలవుతోంది. బయటంతా ప్రశాంతంగా ఉంది. ఏదో జైలులోంచి బయటపడ్డట్టుగా ఫీలయ్యాడు శ్రీనివాసరావు. బయట వీస్తున్న గాలి వేడెక్కిన అతని శరీరానికి చాలా హాయినిచ్చింది. రోడ్డుమీద నడుస్తున్నాడు. దూరంగా ఎక్కడో బ్యాండువాళ్ల చప్పుడు శ్రావ్యంగా వినవస్తోంది.

సునీతాదేవి అందరిలా తననెందుకు ఆదరిస్తుంది. తను క్యాడిలాక్ కారులో వెళ్లలేదు. తను ఇంపార్టెంట్ ఆఫీసరు కాదు. తన భర్త ఆఫీసులోనే తన భర్తకింద పనిచేస్తున్నవాడు. అందుకే తనకేసి అంత నిర్లక్ష్యంగా... చూసింది సునీతాదేవి. ఆమె అతనికేసి చూసిన ఆ చూపు అతన్ని వెంటాడసాగింది.

శంకర్రావు – ఎంత అదృష్టవంతుడు శంకర్రావు. కలలో కూడా ఊహించని సౌందర్యదేవతని తన స్వంతం చేసికున్నాడు. శంకర్రావు– హైస్కూల్లో తనతోపాటు చదువుకున్న శంకరం కళ్ళల్లో మెదిలాడు. దీనంగా హీనంగా, బిక్కమొహం వేసికొని,

తైలసంస్కారం లేని చింపిరి తలతో, చినిగిన గుడ్డపీలికలతో తను దయదలచి ఇచ్చిన పుస్తకాలు, గుడ్డలు, డబ్బులతో చదువుకున్న శంకర్రావు - ఈనాటి సునీతాదేవి భర్త శంకర్రావు! శ్రీనివాసరావులో విపరీతమైన సంచలనం చెలరేగింది. ఒక్కసారి అతని అంతరాంతరాల్లో భయంకరమైన మంటలు గుప్పుమన్నాయి.

ఇవ్వాళ్ల శంకర్రావు ముందు, శంకర్రావు భార్య ముందు - తను - అంత దీనంగా, హీనంగా నిల్చోవల్సిన దుర్గతి తనకెందుకు పట్టింది! శంకర్రావు భార్య తనను అందరిలా ఆహ్వానించక ఈగలాగ దులపరించుకుపోయే దయనీయ స్థితి తనకెందుకుపట్టింది? తనముందు దీనంగా, బిక్కమొహం వేసుకొని, తన సహాయం కోసం పడిగాపులుపడ్డ శంకర్రావు ముందు ఇవ్వాళ్ల తను అలా దీనంగా నిల్చోవటమా? శంకర్రావు భార్య తనను ఒక సాటిమనిషిగా చూడకపోవటమా? తన కుటుంబం మొదటి నుంచి బాగా ఉన్న కుటుంబమే!.. తనూ శంకర్రావులాగా బి.ఇ. ప్యాసయ్యాడు. కాని ఎందుకు తను యివ్వాళ్ల ఇంత ఘోరంగా అవమానింపబడ్డాడు? ఎందుకు? ఎందుకు? ఎందుకు? తనకెందుకు సునీతాదేవి లాంటి భార్య దొరకలేదు? తనకెందుకు శంకర్రావ్ కున్న కారు - మేడ, స్నేహితులు లేరు! తనకెందుకు శంకర్రావ్‌లాగ వెంటనే ప్రమోషన్ దొరకలేదు.

తనో ఫూల్ కాబట్టి. తనో ఇడియట్ కాబట్టి. తనో యూజ్‌లెస్ ఫెలో కాబట్టి, యేవో పిచ్చి పిచ్చి పుస్తకాలు చదివి, యదార్థ జీవితం యొక్క నిజస్వరూపం తెలియని వయస్సులో యేవో ఆదర్శాలని వల్లిస్తూ తనేదో గొప్పపని చేస్తున్నానన్న భ్రమతో బతికాడు! యేమిలేని దరిద్రురాల్ని సుశీలను పెళ్ళి చేసికున్నాడు. అదీ కారణం - తను ఇవ్వాళ శంకర్రావ్ ముందు, వాడి పెళ్ళాం ముందు అంత దీనంగా నిల్చోవటానికి కారణం తన పెళ్ళి! సుశీలకేముందని సుశీలను పెళ్ళాడాడు? నిజంగానే తనో ఫూల్ - సునీతాదేవిలోని సహస్రాంశమైనా సుశీలలో ఉందా? మొదట్లో సుశీల అందమైందే అనుకున్నాడు. అలా అనుకోవటానికి కారణం తను చదివిన పుస్తకాలే - 'అమాయకంగా కన్పిస్తే నాకిష్టం' అనుకోవటం ఆ రోజుల్లో ఏదో పిచ్చి ఆనందాన్ని కల్గించేది. సుశీల అమాయకంగా కన్పించగానే తను వెదుకుతున్న తన ఊహాసుందరి ఈమేనని ఎగిరి గంతులేశాడు. కాని ఇవాళ సునీత పక్కన సుశీలను చూస్తే సూర్యుని ముందు గుడ్డిదీపంలా వెలవెలబోతోంది. సునీత బి.ఎ. ప్యాసయింది. అచ్చం ఇంగ్లీషు లేడిలాగ చక్కని యాక్సెంటులో ఇంగ్లీషు మాట్లాడుతుంది. సుశీలకు ఒక్క ఇంగ్లీషు ముక్క కూడా రాదు. సునీత సంఘంలో తన భర్తస్థానాన్ని ఎంత పైకి తోసింది. 30 వేలు ఖరీదుచేసే కారు తెచ్చింది. తన భర్తకు ప్రమోషన్ తెచ్చింది. సుశీల తనకేం తెచ్చింది. బికారిలా వచ్చింది., తననూ బికారిని చేసింది. సంఘంలో తన స్థానాన్ని

కిందకీడ్చింది - చిత్రం! తను ఇంతకాలం సుశీలతో ఎలా కాపురం చెయ్యగలిగాడు? తను ఇంత పనికిమాలిన వాడుగా తయారవటానికి కారణమైన సుశీలను తను ఎలా ప్రేమించగల్గుతున్నాడు.

దూరంగా వస్తున్న ఏదో పెళ్ళి ఊరేగింపు - బ్యాండు వాళ్ళు దగ్గరయ్యారు. పెళ్ళి చేసుకోవటంలోనే తను పప్పులో కాలువేశాడు. అప్పటి వయస్సు, ఆ అమాయకత్వం, ఆ పుస్తకాలు తనను ఏదో ఊహా ప్రపచంలో ఉంచాయి. అప్పుడు తను చేసిన ఆ పొరపాటు తన జీవితాంతం తనను హింసించాల్సిందేనా. తన ముందు దీనంగా ఉండాల్సిన శంకర్రావు ముందు తనే దీనంగా ఉండాలా? తను చేసిన తప్పును సవరించుకునే మార్గమేలేదా?

బ్యాండువాళ్ళు బాగా దగ్గరయ్యారు. చాలా పెద్ద ఊరేగింపు - 20-30 పెట్రోమాక్సు లైట్లు - కాకి యూనిఫామ్‌లో 20-30 మంది బ్యాండువాళ్ళు ఏదో హిందీపాటను చాలా శ్రావ్యంగా వాయిస్తున్నారు. మల్లెపూలతో, గులాబీలతో, చేమంతులతో, చాలా అందంగా అలంకరించబడిన జీపు - ఆ జీపులో మెళ్ళో పెద్దపెద్ద పూలదండలతో పెళ్ళికూతురు పెళ్ళికొడుకు - పెళ్ళికొడుకు గర్వంగా పెళ్ళికూతురుకేసి చూస్తున్నాడు. పెళ్ళికూతురు అందమైనదానిలాగే కన్పిస్తోంది. జీపు వెనకాల చాలా మంది ఆడవాళ్ళు - రంగురంగుల చీరలతో కళకళ్లాడుతున్నారు. ఎవరో చాలా ధనవంతులకు సంబంధించిన పెళ్ళిలావుంది. ఇట్లాంటి ఊరేగింపుల్ని ఎన్నడూ పట్టించుకోని శ్రీనివాసరావ్ రోడ్డు ప్రక్కన నిల్చొని ఆ ఊరేగింపుని ఆసక్తిగా చూడసాగాడు. తనలాగే రోడ్డుకు చుట్టుపక్కల అమ్మలక్కలు ఊరేగింపును చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

"ఆ పెళ్ళికొడుక్కు ఇది రెండోపెళ్ళి" అంది ఒకావిడ.

"అలాగా! అంటే అతని మొదటి భార్య ఏమైనట్టు" అడిగింది యింకోకావిడ.

"పాపం! ప్రసూతై చనిపోయిందట. మొదటి భార్య చనిపోయి మూడు నెలలైనా తిరుగలేదు. అప్పుడే యింత వైభవంగా రెండో పెళ్ళి చేసుకుంటున్నాడు"

"చచ్చినవాళ్లతో చావమంటావా? అందులోను మగబిడ్డడు... మంచి ఉద్యోగం కూడా చేస్తున్నాడట. ఎక్కువ వయస్సు మళ్ళినవాడు కూడా కాదు. అందుకే ఆడపిల్లల తండ్రులు పోటీలు పడి అతణ్ణి వేధించారట - రెండోపెళ్ళి చేసుకోక యేం చేస్తాడు?"

"వరదక్షిణ ఎంతో?"

"ముప్పైవేలట. అంతేకాదు - ఒక స్కూటరు, రేడియో కూడా కొనిచ్చేరట. పైగా వెయ్యి రూపాయలు సూటు-బూటు కోసంట"

"ఔనమ్మా! ఈరోజుల్లో మంచి ఆస్తి ఉండి పోలీరు ఉద్యోగం చేస్తున్న మగపిల్లవాడి రేటు అంతా యింతా అని చెప్పేట్టుందా?"

చాలా ఆసక్తిగా శ్రీనివాసరావ్ ఆ అమ్మలక్కల సంభాషణ విన్నాడు. అకస్మాత్తుగా అతని బుర్రలో తనూ రెండో పెళ్ళి చేసికుంటే? అన్న భావం మెదిలింది. తనకూ 30 వేల కట్నం కంటే ఎక్కువ వస్తుంది. స్కూటర్ కాదు, క్యాడిలాక్‌కారు కొనివ్వమంటాడు. తనకూ పిల్లనిస్తామని పోటీపడి వస్తారు. ఈసారి పిచ్చిపిచ్చి ఆదర్శాలు వల్లించడు. అందరిలోను ఎక్కువ కట్నం ఎవరిస్తే వాళ్ల పిల్లను చేసికుంటాడు. మొదలు చేసిన తప్పును ఈసారి సవరించుకుంటాడు. కాని - కాని- సుశీలనేం చేస్తాడు. ఇందాకటి పెళ్ళికొడుకు మొదటి భార్యలా సుశీల కూడా చనిపోతే బావుండును. అప్రయత్నంగా అతనిలో ఈ భావం జనించటం అతన్ని ఆశ్చర్యపరిచింది.

శ్రీనివాసరావు గుండెల్లో యేదో భయం వ్యాపించింది. లోపల చలిజ్వరం వచ్చినవాడిలా యేదో వణకు కూడా ప్రారంభమైంది. పాపం, సుశీల చనిపోతుందా! ఈ పాడుభావం తనకెందుకు కల్గింది? కానీ తప్పదు - సుశీల చనిపోతుంది. తప్పదు. సుశీల చనిపోతుంది. అది అంతే. అది తన జాతకంలోనే ఉంది. ఔను. మరిచేపోయాడు. చిన్నప్పుడెప్పుడో తన చేయి చూసిన ఓ జ్యోతిష్కుడు "ఈ అబ్బాయికి ద్వితీయ కళత్రం ఉంది" అని బల్లగుద్ది జోస్యం చెప్పాడు. మరో శాస్త్రులవారు కూడా తన చేయి చూసి "ఈ పిల్లవాడికి ద్వితీయ వివాహం కాకపోతే తను జ్యోతిష్యం చెప్పడం మానేస్తా"నని శపథం చేశాడు. ఎప్పుడో చిన్ననాడు జరిగిన ఈ సంఘటనల్ని తను మరిచేపోయాడు. ఇంకేముంది. తన జాతకంలోనే ఉన్నాక ఎవడు తప్పిస్తాడు. బ్రహ్మరాసిన రాతను తప్పించటానికి బ్రహ్మతరం కూడా కాదు. సుశీల చనిపోతుంది... తప్పదు.

సుశీలమీద జాలి కలిగింది.

పాపం సుశీల... వొట్టి అమాయకురాలు. ఔను, అమాయకురాలే చనిపోయేది, అమాయకులకు ఈ లోకంలో స్థానం లేదు. సునీతాదేవి వెయ్యి కాండిల్స్ బల్బులాగ అతని కళ్ళల్లో ప్రవేశించింది. సునీతాదేవిలో ఎంత కళ్లు మిరుమిట్లుగొలిపే సౌందర్యం. ఆ నడకలో ఎంత ఠీవి. ఆ చూపులో ఎంత గర్వం. ఆ మాటల్లో ఎంత అహంభావం, ఆమె మొహంలో ఎంత కళ! అట్లాంటి సునీతాదేవి పక్కన శంకర్రావు - తను పుస్తకాలిస్తే చదువుకుని తన పాత ప్యాంట్స్ షర్ట్స్ వేసుకొని కాలేజికి వచ్చినవాడు. వాడిమీదనా సునీతాదేవికి అంత ఆరాధన. అంత ప్రేమ - శంకర్రావును

ఎంత అపురూపంగా చూసుకుంటున్నది సునీతాదేవి. తన పాదాలు కడగటానికి కూడా పనికిరాని శంకర్రావుమీద ఆ సౌందర్యదేవతకు అంత ఆరాధనా? ఎందుకో శ్రీనివాసరావు గుండెల్లో మళ్ళా మంటలు లేచాయి. అతని హృదయం భగ్గున మండిపోయింది.

అసలు అతను తన శ్రీమతి భర్త్‌డే పార్టీకి పిలవటంలోని ఆంతర్యం ఇప్పుడర్థమౌతున్నది. తను ఎంత భోగభాగ్యాలతో తులతూగుతున్నాడో తనకు చూపటానికి, తన భార్య ఎంత లావణ్యంతో వెలిగిపోతున్నదో, తనను ఎలా తన ఆరాధ్య దైవంగా పూజిస్తున్నదో తనకు చూపటానికి, ఆఫ్టరాల్ నాముందు నువ్వెంత అని తనను అవమానపర్చటానికి తనను పిలిచాడు.

ఏమైనాసరే, తనకు సునీత లాంటి భార్య కావాలి. శంకర్రావ్ ముందు తను మళ్ళా ఠీవిగా నిల్చోగల్గాలి. శంకర్రావ్ ఇంటికి తను క్యాడిలాక్ కారులో వెళ్ళాలి. సునీత అందరితో ఎలా వొయ్యారం వొలకబోస్తూ "హౌడుయుడూ?" అందో తనతోనూ అలాగే అనాలి. అందాక నిద్రపోడు. తను రెండో పెళ్ళి చేసుకుంటాడు. సునీతాదేవి కంటె వెయ్యిరెట్లు అందమైన యువనితిని పెళ్ళి చేసుకుంటాడు. సునీత కంటె యింకో లక్షరూపాయలు ఎక్కువ ఆస్తిని తెచ్చే భార్యను చేసుకుంటాడు. తప్పదు- పాపం సుశీల చనిపోతుంది. సుశీల చావును, తన రెండో పెళ్ళిని బ్రహ్మ యేనాడో రాశాడు. బ్రహ్మరాతను బ్రహ్మదేవుడు కూడా తప్పించలేడు.

## 4

శ్రీనివాసరావు ఇల్లు చేరుకున్నాడు. తలుపు గడియవేసి వుంది. ఎందుకో "సుశీలా" అని యిదివరకటిలా పిలవడానికి యేదో అడ్డొచ్చింది. తలుపు కొట్టాడు.

"ఎవరూ!" అంది సుశీల.

"నేనే... తలుపు తీయ్" అన్నాడు.

సుశీల లైట్ వేసి తలుపు తీసింది. సుశీల మొహంలోకి సూటిగా చూడలేక పోయాడు. ఆమెపట్ల యేదో నేరం చేశానన్న భావం అతని అంతఃకరణలో ఎక్కడో రగుల్కొంటున్నది.

"ఇంత రాత్రిదాకా యేం చేశారండి" ఆవులిస్తూ విసుగ్గా అడిగింది.

నిశ్శబ్ధంగా బట్టలు మార్చుకున్నాడు.

"భోజనం చేస్తారా?"

"నువ్వింకా తినలేదా?"

"కొత్తగా అడుగుతున్నారా"

"నీకెన్నిసార్లు చెప్పాను. ఎప్పుడైనా నేను రావటం ఆలస్యమైతే నువ్వు తినవచ్చని. నీ పాతరాతియుగపు చాదస్తం ఎందుకు వదులుకుంటావులే?" కటువుగా అన్నాడు.

సుశీల దెబ్బతిన్నట్లుగా చూచింది. ఆమె మొహం వెలవెలబోయింది. వెంటనే సుశీలమీద జాలి కల్గింది. అనవసరంగా విసుక్కున్నాడు. ఎన్నడూ సుశీలతో ఇలా కటువుగా మాట్లాడలేదు.

"సారీ సుశీ! మూడ్ బాగాలేదు, భోంచేద్దాం పద" అన్నాడు. సుశీల జాలిగా చూసింది. ఆమె కన్నుల్లో చెమ్మ ఎలక్ట్రిక్ బల్బు కాంతిలో మెరిసింది. కిరాతకుడి చేత దెబ్బతిన్న లేడిపిల్లలా కన్పించింది సుశీల. సుశీల నిజంగా అమాయకురాలు, తను యేమన్నా అంటే తిరిగి తనను యేమీ అనదు. కాని బాధతో విలవిల్లాడిపోతుంది. సుశీలలోని ఈ అమాయకత్వమే తననెంతో ఆకర్షించింది. కాని ఈరాత్రి, తనకేదో దయ్యం పట్టింది. తన మనస్సంతా యేదో కాలకూట విషం ఆవరించింది.

"రా సుశీ!... భోంచేద్దాం రా! ఈసారి ఎప్పుడూ విసుక్కోనుగా... నిజంగా మూడ్ బాగాలేదు. ఆ వెధవపార్టీకి అనవసరంగా వెళ్ళాను... నిజానికి నేనక్కడే భోంచేసి రావాలి. కానీ నా మూడ్ చెడిపోయింది" అన్నాడు.

ఎన్నడూలేంది తన కంఠంలో యేదో కృత్రిమత్వం ధ్వనించింది. సుశీల నిశ్శబ్దంగా వంటగదిలోకి వెళ్ళింది. ఆమెతో శ్రీనివాసరావు వెళ్ళాడు. భోజనం ముందు కూర్చున్నాడేగాని మనస్సు భోజనం మీదికి వెళ్ళటం లేదు. ఈపాటికి శంకర్రావు యింట్లో అంతా గ్రాండ్‌గా విందారగిస్తూ ఉంటారనిపించింది. తను వెళ్ళిపోయానని బాధ పడ్డవారు గాని, పట్టించుకున్నవారు గానీ ఎవడూ ఉండడు. అంతా నవ్వుతూ, కేరింతలు కొడుతూ, కేకలేస్తూ, సునీతాదేవి అందాన్ని కూడా విందుతోపాటు ఆరగిస్తూ... శ్రీనివాసరావు బాధగా కళ్ళు మూసుకున్నాడు. అతనికి అన్నం సయించలేదు. నాలుగు మెతుకులు కొరికి లేచాడు. సుశీల తల వంచుకొని తింటున్నట్లుగా నటించింది.

చేయి కడుక్కొని బెడ్‌రూమ్‌లోకొచ్చాడు. పక్కమీదకి చేరాడు. తన ఈనాటి బాధకంతా ఈ సుశీలే కారణం. మళ్ళా అదే భావం అతన్ని వశపరచుకుంది. సుశీల చనిపోవాలి– సుశీల చనిపోవాలి– అప్పుడుగాని తనకు మనశ్శాంతి, శ్రీనివాసరావుకు భయమేసింది. వణికిపోయాడు. ఇదేమిటి... తనివ్వాళ యిలా మారిపోయాడు. తను తనలా ఆలోచించలేకపోతున్నాడు. తనలో తనకి తెలియని క్రూరమానవుడెవడో

అకస్మాత్తుగా నిద్ర మేల్కొని కొండచిలువలా ఆవలిస్తున్నాడు. పెద్దపులిలా గాండ్రిస్తున్నాడు. విషసర్పంలా బుసకొడ్తున్నాడు.

శ్రీనివాసరావు బాధగా కళ్ళు మూసికున్నాడు. ధగద్ధాయమానంగా టెక్నికలర్‌లో సునీతాదేవి మెరిసిపోతున్నది. తనకేసి చూసిన ఆ చూపు అతని బుర్రలో మెరుపులా మెరిసింది. "డార్లింగ్! డార్లింగ్" తియ్యగా పిలుస్తూ శంకర్రావు కళ్ళల్లోకి ఆరాధనా జ్యోతుల్ని పంపిస్తున్నది. సునీత సౌందర్యపు వెలుగులో విశ్వరూపాన్ని చూసిన అర్జునునిలా తరించిపోతున్నాడు శంకర్రావు. బిక్కమొహం వేసుకొని, దీనంగా చూస్తున్నాడు శ్రీనివాసరావు.

విసుగ్గా కళ్ళు తెరిచాడు శ్రీనివాసరావు. బాధగా కణతలు వొత్తుకున్నాడు. కళ్లు మూసుకొని నిద్రపోవటానికి ప్రయత్నించాడు. దార్లో యిందాక చూసిన ఊరేగింపు... రెండోపెళ్ళి! మొదటిభార్య ప్రసూతై చనిపోయింది. ఇంకా మూడు నెలలు నిండలేదు. వైభవంగా రెండో పెళ్ళి చేసుకొని ఘనంగా వూరేగుతున్నాడు- తనూ ఊరేగుతున్నాడు. తన పక్కన వెయ్యి పెట్రోమాక్సు దీపాల కాంతితో వెలుగుతున్న పెళ్ళికూతురు. తను కలలో కూడా ఊహించనంత సౌందర్యంతో కళ్ళు జిగేలుమని పిస్తున్న పెళ్ళికూతురు. తన కళ్ళల్లోకి "డార్లింగ్, డార్లింగ్!" అంటూ ఆరాధన జ్యోతుల్ని పంపిస్తున్న పెళ్ళికూతురు... ఇదేమిటీ? తను కలకంటున్నాడా? తనెక్కడున్నాడిప్పుడు? వంటింట్లో గిన్నెల చప్పుడు... కళ్ళు తెరిచాడు శ్రీనివాసరావు. సుశీల వంటింట్లో పని ముగించుకొని బెడ్‌రూమ్‌లో ప్రవేశిస్తోంది. లైట్ ఆర్పేసి జీరో క్యాండిల్ బల్బు వెలిగించి తన పక్కన పడుకుంది.

తన పక్కన ఎవరో కొత్తవ్యక్తి వచ్చి పడుకున్నట్లనిపించింది. రెండేళ్ళుగా ప్రతిరాత్రి వచ్చి యిలాగే తన పక్కన పడుకుంటున్నది సుశీలేనా? ఎందుకో అకస్మాత్తుగా తనకు సుశీలకు మధ్య కొన్ని కోట్ల మైళ్ళదూరం యేర్పడింది. రోజు పక్కమీదకు రాగానే సుశీలను తన చేతుల్లోకి తీసుకునేవాడు. తన హృదయానికి హత్తుకొనేవాడు. పసిపిల్లలా సుశీల తన కౌగిట్లో వొదిగిపోయేది. కాని ఈరాత్రి తనకేమయింది?

సుశీల అతనివైపు తిరిగింది. అతని మొహంలో మొహం పెడ్తూ "వంట్లో బాగాలేదా!" అంది. "ఔను బాగాలేదు. వంట్లో కాదు... మనసులో బాగాలేదు. భూతం ప్రవేశించింది అనాలపినిపించింది.

"ఔను... బాగాలేదు. మనస్సంతా చిరాకుగా ఉంది" అన్నాడు రెండు చేతుల్తో తలపట్టుకుంటూ.

"తలనొప్పా? అమృతాంజనం రాయమంటారా" ప్రేమగా సుశీల...

"అక్కర్లేదు- నన్నిలా వదిలెయ్" విసుగ్గా అన్నాడు.

సుశీల మళ్ళీ మాట్లాడలేదు. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసలు బరువుగా వినిపిస్తున్నాయి. మళ్ళీ సుశీల మీద జాలి కల్గింది. సుశీలను తనవైపు లాక్కున్నాడు. యేదో వెర్రి ఆవేశంతో ఆమెను తన గుండెలకు హత్తుకున్నాడు. ఆమెమీద కసిగా ముద్దుల వర్షం కురిపించాడు. యేదో కసి, తనని తాను హతమార్చుకోవాలన్నంత కసి, సుశీలను ముక్కలు చెక్కలుగా నరికి వేయాలన్నంత కసి. సుశీల కూడా అతన్ని యేదో వెర్రి ఆవేశంతో కరుచుకుపోయింది. క్షణంసేపు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

"నిజంగానే మీకివ్వాళ్ళ మూడ్ సరిగ్గాలేదు..." అంది గుసగుసగా అతని చెవిలో-

"ఔను సుశీ-" బాధగా అన్నాడు.

"ఇవ్వాళ మీకో ఒక విషయం చెప్పాలనుకున్నాను... కాని ఇవ్వాళ మీ మనసు బాగాలేదు" తనను యింకా దగ్గరగా హత్తుకుంటూ సుశీల.

"యేమిటా విషయం-"

"ఇప్పుడు వద్దులెండి- మరెప్పుడైనా చెప్తాను-" సుశీల సన్నగా నవ్వుతూ-

"ఫరవాలేదు... చెప్పు సుశీ-!" సుశీల చెప్పబోయే విషయం యేమై ఉంటుందా అన్న క్యూరియాసిటీ అతనిలో పెరిగిపోయింది.

"చెప్పు సుశీ? ఏమిటది" మళ్ళీ అన్నాడు.

"చెప్పమంటారా?"

"ఊఁ! చెప్పు"

"ఎలా చెప్పేదండి" రెండు చేతుల్తో మొహాన్ని కప్పుకుంటూ, అందంగా సిగ్గుపడ్తూ అతని గుండెల్లో దూరింది సుశీల.

శ్రీనివాసరావుకేదో అస్పష్టంగా తెలిసిపోయింది. అతనిలో క్యూరియాసిటీ విపరీతంగా పెరిగిపోయింది. చాలా పట్టుదలగా అడిగాడు.

"చెప్పు సుశీ! చెప్పు - వెంటనే చెప్పాలి - యేమిటది - ఊఁ చెప్పు - నాదగ్గర సిగ్గెందుకు?"

క్షణంసేపు భరించలేని నిశ్శబ్దం.

ఇద్దరి గుండెల చప్పుడు టిక్కుటిక్కుమనే గడియారం చప్పుడులా స్పష్టంగా వినబడుతోంది.

అతనికేసి ఏదో వింత ఆనందంతో చూస్తూ, "మీరు తండ్రి కాబోతున్నారు" అంది. అంటూనే మళ్ళా అతని గుండెల్లో ఆమె మొహాన్ని దాచుకుంది.

ఒక్క క్షణం శ్రీనివాసరావు స్తంభించిపోయాడు. ఎందుకో సుశీల చెప్పిన మాట అతనిలో విపరీతమైన భయాన్ని ప్రేరేపించింది. ఆ మాట విన్నప్పుడు అతనిలో ఎలాంటి థ్రిల్ కల్గలేదు. సరిగ్గా ఇలాగే జరుగుతుందని అతనికెప్పుడో తెలుసునని పించింది. సరిగ్గా ఇలాంటి దృశ్యాన్ని, మాటనే తను యిదివరికే ఎప్పుడో చూసినట్టుగా, విన్నట్టుగా ఫీలయ్యాడు. శ్రీనివాసరావు బుర్రలో మళ్ళా యిందాక తను చూసిన పెళ్ళి ఊరేగింపు త్రాచుపాములా బుసకొడ్తూ మెదిలింది. పెళ్ళికొడుకు మొదటి భార్య ప్రసూతై చనిపోయింది. సుశీలకూడా ప్రసూతై చనిపోతుంది. ఇలా జరగాలని అంతా యిదివరకే నిర్ణయమైపోయింది. బ్రహ్మ ఎప్పుడో రాసాడు. తనకు రెండో పెళ్ళని రాశాడు. సుశీలకు చావు రాశాడు.

సుశీల తనలోకంలో తాను యేవో కలలు కంటోంది. అతన్ని పెనవేసుకు పోతున్నది. అతన్ని అతని లోకం నుంచి బయటకు లాగి అతని రక్తాన్ని రెచ్చగొట్టింది. 'ఎన్నడూ లేంది యేమిటి సుశీలలో ఈ ఉద్రేకం' అని ఆశ్చర్యపడ్డాడు శ్రీనివాసరావు.

## 5

ఆనాటి నుండి శ్రీనివాసరావు రెండో పెళ్ళిని గూర్చి కలలు కనటం అధికమయింది. ఏ క్షణంలో అతనిలో రెండో పెళ్ళిని గూర్చిన భావం ఉదయించిందో, అది ఆ క్షణం నుండి దినదిన ప్రవర్ధమానమౌతూ అతన్ని పూర్తిగా వశపరచుకుంది. సుశీల చనిపోతుందన్న నమ్మకం కూడా అతనిలో రోజురోజుకు దృఢతరమయింది.

నెలలు నిండుతున్నకొద్దీ సుశీల ఆరోగ్యం కూడా చెడిపోయింది. ఆరోగ్యాన్ని గూర్చి రోజూ ఏదో ఒక ఫిర్యాదు చేస్తూనే ఉంది. ఒకటి రెండుసార్లు డాక్టరు దగ్గరకు తీసికెడదామనుకున్నాడు. కాని ఏవో పనులు, అశ్రద్ధ, రేపు వెళ్ళొచ్చులే అనుకుంటూ వాయిదా వేస్తూ వచ్చాడు. చివరకు ఓసారి గైనకాలజిస్టు దగ్గరకు తీసికెళ్ళాడు. కొన్ని జాగ్రత్తలు చెప్పి కొన్ని మందులు రాసిచ్చింది. వాటిని తెచ్చిచ్చాడు. కానీ వాటి వల్ల పెద్దగా ఫలితం ఉండదేమో అనుకున్నాడు.

అప్పుడప్పుడు శ్రీనివాసరావుకు సుశీలమీద చాలా జాలి కలిగేది. పాపం ఎట్లాగు చనిపోతుంది గదా, సుశీలతో ఈ నాలుగు రోజులైనా హాయిగా గడుపుదామను కునేవాడు.

చాలా రోజుల తర్వాత ఆ రోజు సుశీలను ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు, చాలా ప్రేమగా మాట్లాడాడు, హృదయానికి హత్తుకున్నాడు. రేపు తప్పకుండా మరోసారి డాక్టరు దగ్గరకు తీసికెడతానన్నాడు. ఇది విని సుశీల వెక్కివెక్కి యేడ్వడం మొదలెట్టింది. శ్రీనివాసరావుకు భయమేసింది. తను కురిపిస్తున్న ఈ ప్రేమంతా వొట్టినటనేనని సుశీల తెలుసుకున్నదా? అనే అనుమానం కల్గింది. సుశీల అమాయకురాలు అనుకున్నాడు.

"ఎందుకు సుశీ యేడ్పూ?" అడిగాడు.

సుశీల అలాగే యేడ్చింది. జవాబు చెప్పలేదు. సుశీల కళ్ళనీళ్ళు ధారలు కట్టాయి.

"సుశీలా! ఎందుకలా యేడుస్తావు? నాతో చెప్పవా?" మళ్ళా అడిగాడు. సాధ్యమైనంత అనునయంగానే అడిగాడు. సుశీల యేమీ చెప్పలేదు. చాలాసేపు నిశ్శబ్దంగా యేడ్చింది. శ్రీనివాసరావు ఆమె యేడ్పుకు కారణమేమై ఉంటుందా అని ఆలోచించసాగాడు.

అయిదారు నిముషాల తర్వాత కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ సుశీల అంది "యేమండీ- ఒకవిషయం అడుగుతాను- నిజం చెబుతారా?"

శ్రీనివాసరావు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. సుశీల అడగబోయే దేమిటోనని, భయంతో వణికిపోయాడు.

"అడుగు సుశీ, తప్పకుండా నిజం చెబుతాను... ఏమిటది?" శ్రీనివాసరావు గొణిగాడు.

"మీకు... మీకు నేను చనిపోతే బావుండుననిపిస్తోంది కదూ?" అంది సుశీల, గాద్గదికంగా, కట్టలు త్రెంచుకొని ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ.

ఎవరో తన ఆయువుపట్టుమీద బలంగా దెబ్బతీసినట్లుగా క్రుంగిపోయాడు శ్రీనివాసరావు. ఎక్కడో తన అంతరాంతరాళాల్లో, తన అథోలోకంలో మసలుతున్న ఈ భయంకర రహస్యం సుశీలకెలా తెలిసింది!?"

వెక్కి వెక్కి యేడుస్తూనే సుశీల "ఔను... నేను చనిపోతే బావుండునని మీరు అనుకోవటంలో పొరపాటేమీలేదు... మీకు నేను యేవిధంగాను తగినదాన్ని కాను... నేను చదువుకోలేదు... పైసా కట్నం లేకుండా బిచ్చపుదానిలా మీ ఇంటికొచ్చాను. మీ చదువుకు, మీ ఆస్తికి, మీకు వేలకొద్ది కట్నం వచ్చేది... నా కారణంగా మీరు ఎన్నో విధాల నష్టపడ్డారు... ఐనా నేనిక బతకనులెండి... నేను చనిపోయాక మళ్ళీ పెళ్ళి చేసుకోండి, మీకు తగినదాన్ని, అందమైనదాన్ని బాగా చదువుకున్నదాన్ని... బాగా డబ్బుతెచ్చేదాన్ని..."

దుఃఖం ఉప్పెనలా సుశీలను ముంచేసింది. సుశీల అంటున్న ఒక్కొక్క మాట ఈటెలా శ్రీనివాసరావు హృదయాన్ని దూసుకుపోయింది.

తననెవరూ గుర్తించరని ధైర్యంగా తిరుగుతున్న హంతకుణ్ణి అకస్మాత్తుగా పోలీసులు చుట్టుముట్టినపుడు ఆ హంతకుడు ఎలా అయిపోతాడో శ్రీనివాసరావు అలా అయిపోయాడు. ఏదో విపరీతమైన భయం అతని గొంతును నులిమివేసింది.

సుశీల అలాగే యేడుస్తోంది. కుమిలి కుమిలి యేడుస్తోంది. ఆమెను దగ్గరకు తీసుకొని ఓదార్చే నైతికబలం అతనిలో లేదు. అతనిలోని నైచ్యాన్ని అంత స్పష్టంగా చూడగల్గిన సుశీల తనకంటె ఎంతో ఉన్నతంగా యెదిగిపోయినట్లనిపించింది. ఐనా పాషాణాల్ని కూడా కరిగించే ఆమె దుఃఖాన్ని యిక భరించలేకపోయాడు. ఆమెను తన మీదికి తీసుకుంటూ "పిచ్చి సుశీ! ఎందుకు కల్గాయి ఈ పిచ్చి ఊహలు నీలో. నా యిష్టపూర్వకంగానే నిన్ను చేసుకున్నాను. నువ్వు కట్నం తేలేవని, చదువుకోలేదని నాకు మొదటే తెలుసు. ఈ పిచ్చి ఊహల్ని నీ మనస్సులోకి రానివ్వకు. నువ్వు మామూలు మనిషివి కూడా కాదు. రేపు తప్పకుండా మరో పెద్ద డాక్టర్ దగ్గరకు తీసుకెడతాను... నీ ఆరోగ్యం కోసం ఎంత డబ్బైనా ఖర్చు చేస్తాను... ప్లీజ్! నువ్విలా బాధపడ్తే నేను తట్టుకోలేను" అంటూ ఓదార్చాడు సుశీలను. యేడుస్తూనే నిద్రపోయింది సుశీల.

ఆ తెల్లారి సుశీలను లేడీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆమె సుశీలను పరీక్ష చేసింది.

"చాలా బలహీనంగా ఉంది. ప్రసవం కష్టం కావచ్చు. ఐనా ఈ మెడిసిన్స్ వాడండి షీ విల్‌బి ఆల్‌రైట్!" అంటూ ఒక చీటీ యిచ్చింది. షాపుకెళ్ళి ఆ మందులు తెచ్చాడు.

డాక్టరు చెప్పిన మాటలు విన్నాక, రేపు సుశీలకు యేమన్నా అయితే ఆ పాపం పూర్తిగా తనదేననే భయం కలిగింది శ్రీనివాసరావుకు. నాల్గోనెల నుండే సుశీల తన ఆరోగ్యాన్ని గూర్చి యేదో ఫిర్యాదు చేస్తూనేఉంది. డాక్టర్ దగ్గరకెడదామని సూచిస్తూనే ఉంది. తను మామూలు డాక్టర్ దగ్గరకు కాకుండా స్పెషలిస్టు దగ్గరకు తీసికెళ్తే బావుండేది...

కాని డాక్టర్ మాటలు విన్నాక శ్రీనివాసరావులో ఒక మూల ఆనంద తరంగాలు లేస్తూనే ఉన్నాయి. తన కలలన్నీ నిజమయ్యేరోజు దగ్గరౌతున్నదని మురిసిపోయాడు. మరోపక్క తను చాలా చెత్తని ఆలోచిస్తున్నానన్న భావం కూడా అతన్ని వేధిస్తూనే ఉంది.

సుశీలకు నెలలు నిండుతున్నాయి. నెలలు నిండుతున్నకొద్దీ, సుశీల దుఃఖం కూడా ఎక్కువైంది. సుశీలకు కూడా తను చనిపోతానన్న నమ్మకం అంతకంతకూ ఎక్కువయింది. శ్రీనివాసరావుతో రోజూ అదేమాట!

"ఈసారి జాగ్రత్తపడండి... అన్నివిధాలా మీకు తగినదాన్ని చేసుకొండి. నేను మీకు యే విధంగానూ తగినదాన్ని కాను... ఈసారి అందమైన అమ్మాయిని, డబ్బుతెచ్చే అమ్మాయిని బాగా చదువుకున్న అమ్మాయిని చూసి చేసుకోండి... నేను పోతున్నాను..." అంటూ హృదయ విదారకంగా యేడ్చేది.

సుశీలకు నెలలు నిండాయని తెలిసి వాళ్ళ అమ్మనాన్న వచ్చారు. శ్రీనివాసరావు అమ్మగూడా వచ్చింది.

"మొదటి కాన్పుకు సుశీలకు వాళ్ళ తల్లిగారింటివాళ్ళు పురుడుపోయడం ఆచారం. కాని వాళ్లు పాపం పేదవాళ్ళు ఆసుపత్రికి తీసుకపోలేరు. అందువల్ల సుశీల యిక్కడే పురుడుపోసుకుంటుంది. ఇక్కడ ఆసుపత్రి ఉందిగా" అంది శ్రీనివాసరావువాళ్ళ అమ్మ.

"అలాగే కానియ్" అన్నాడు శ్రీనివాసరావు.

## 6

ఆరోజు పగలు రెండు గంటలకు సుశీలకు నొప్పులొచ్చాయి, హాస్పిటల్‌కు తీసికెళ్ళారు. లేడీడాక్టర్ చూసింది. ప్రసూతి కావటానికి చాలా టైముందని చెప్పింది. సాయంకాలం వరకు సుశీల నొప్పులు పడుతూనే ఉంది. డాక్టర్ మళ్ళీ ఒకసారి సుశీలను పరీక్షచేసి శ్రీనివాసరావును తన గదికి పిలిచింది.

"చాలా బలహీనంగా ఉంది. డెలివరీ చాలా కష్టమయ్యేటట్లుంది" అంది.

ఈమాటే వింటానని శ్రీనివాసరావు చాలా కాలంగా కలలు కంటున్నాడు. మళ్ళీ డాక్టరే "ఈ రాత్రికి చూద్దాం... మామూలు డెలివరి అయితే మంచిదే... కాకపోతే రేపు సిజేరియన్ ఆపరేషన్ చేయ్యాల్సి ఉంటుంది" అంది.

ఆమాట వినడంతోనే యిక సుశీల చనిపోవటం తప్పనిసరి అనుకున్నాడు శ్రీనివాసరావు. అది బ్రహ్మరాసిన రాత - అది తన జాతకంలోనే ఉంది. ఎవ్వడూ తప్పించలేడు. ఇలా జరగాలని యిదివరకే ఎప్పుడో నిర్ణయమైపోయింది.

డాక్టర్ రూమ్ నుండి బయటకొచ్చాడు. ఈ విషయం వాళ్ళ అమ్మతో అత్తా, మామలతో చెప్పాడు. సుశీల అమ్మ బావురుమంది. శ్రీనివాసరావు వెళ్ళి వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్నాడు.

బుర్రనిండా యేవేవో భావాలు గజిబిజిగా అల్లుకుపోతున్నాయి. దారి డొంకా లేని అరణ్యంలో పడిపోతున్నాడు. ఆ అరణ్యంలో నుండి ఎంత ప్రయత్నించినా బయటకు రాలేకపోతున్నాడు.

హాస్పిటల్లో లైట్లు వెలిగాయి. టైము చూసుకున్నాడు. యేడు దాటింది. హాస్పిటల్ వరండాల్లో తెల్లని దుస్తుల్లో నర్సులు అటూ యిటూ తిరుగుతున్నారు. తన పక్క రూమ్స్‌లో నుండి ఇద్దరు ముగ్గురు స్త్రీలు నొప్పులు పడ్తూ చేస్తున్న హృదయ విదారకరమైన రొద... అందులో సుశీల కూడా ఉంది. ఎవరో అతని గుండెల్ని పిండుతున్నట్టుగా విలవిల్లాడిపోయాడు.

సరిగ్గా యిలాగే జరుగుతుందని ఊహించాడు శ్రీనివాసరావు. చిత్రం!... తను ఎలా ఊహించాడో అలాగే జరుగనున్నది. యిలాంటి దృశ్యాన్నే తను యిదివరకే ఎక్కడో చూశాడు. 'పెద్దలు చెప్పినట్లు ఈ భూవలయం మీద జరిగే ప్రతి సంఘటనా ఇదివరకే నిర్ణయమైవుంది. శివాజ్ఞ లేనిదే చీమైనా కదలదు' అనే మాటలోని నిజం తనకిప్పుడు తెలిసివస్తోంది. ఈ జగన్నాటకంలో ఎవరెవరి పాత్రలేమిటో ఎవరెవరు రంగం మీద ఎంతసేపుండాలో ఎప్పుడో బ్రహ్మ నిర్ణయించేశాడు. దానికింక తిరుగులేదు.

రెండు మూడుసార్లు సుశీల ఉన్న గదివేపు వెళ్ళివచ్చాడు. సుశీల నొప్పులు పడ్తూ భయంకరంగా రోదిస్తోంది. కిరాతకుడి తుపాకి గుండుకు బలియైన లేడిపిల్లలా కొట్టుకుంటోంది. సుశీల ఏ క్షణంలోనైనా ప్రాణాలు కోల్పోవచ్చుననిపించింది. ఎందుకో శ్రీనివాసరావుకు కడుపులో దేవినట్టనిపించింది. యేదో గగుర్పాటు కలిగింది. సుశీలను అలా నిర్దాక్షిణ్యంగా చంపుతున్న హంతకుడు తనేననే భావం కల్గింది.

మళ్ళీ వచ్చి వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్నాడు. తన ప్రక్కనే బిక్కమొహంతో సుశీల తండ్రీ అంటే తన మామగారు కూర్చున్నాడు.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఆకలేస్తున్నట్లనిపించింది. హోటలుకెళ్ళి తినొద్దామా అనుకున్నాడు. కాని వెళ్ళాలనిపించలేదు. సుశీల యే క్షణంలోనైనా ఈ లోకాన్ని శాశ్వతంగా విడిచివెళ్ళవచ్చు. కనీసం అప్పుడైనా తను ఆమె పక్కన లేకపోవటం చాలా క్రూరంగా తోచింది.

పాపం! సుశీల పదిహేడేళ్ళయినా నిండని సుశీల, మాయా మర్మం, కల్లాకపటం యెరుగని సుశీల, అమాయకంగా, పెద్ద పెద్ద కళ్ళతో తన హృదయాన్ని దోచుకున్న సుశీల! తననో రాజులా, దేవుడిలా చూసుకున్న సుశీల! యేనాడు తన మాటకు యెదురుచెప్పని సుశీల, తను ఎప్పుడయినా కటువుగా మాట్లాడితే బాధతో

విలవిల్లాడిపోయిన సుశీల! ఆఫీసు నుండి కాస్త ఆలస్యంగా వస్తే తనకోసం క్షణమొక యుగంగా ఎదురుచూసిన సుశీల! సుశీల మీద అతనికి విపరీతమైన జాలి కల్గింది. వెంటనే మళ్ళీ తన సుశీలను గుండెలకు హత్తుకుని తనివితీరా యేడ్వాలనిపించింది. తన కన్నీళ్ళతో తన మలిన హృదయాన్ని క్షాళనం చేసుకోవాలనిపించింది. అప్పుడు గాని తన హృదయ భారం తగ్గదు. అప్పుడుగాని తనకు నిజమైన శాంతి లభించదు.

కాని తప్పదు. సుశీల చనిపోక తప్పదు. తనకు రెండోపెళ్ళి తప్పదు. లక్ష వర్ణాలతో ధగద్ధాయమానంగా జరిగే తన రెండో పెళ్ళి తప్పదు. కోటి దీపాల కాంతితో మెరిసిపోయే తన రెండో భార్య రాక తప్పదు!

శ్రీనివాసరావుకు తనేదో ఊబిలో కూరుకుపోతున్నట్లనిపించింది. ఆ ఊబి నుండి బయటపడాలని తన శక్తినంతా కూడదీసుకొని ప్రయత్నిస్తున్నాడు. కాని ఆ ఊబిలో నుండి బయటపడలేకపోతున్నాడు. ఇంకా ఇంకా ఆ ఊబిలోకే దిగజారి పోతున్నాడు.

అర్ధరాత్రి దాటిపోయింది. టైం చూసుకున్నాడు. పన్నెండున్నర... శ్రీనివాసరావు కళ్ళు మూసుకుపోతున్నాయి... నిద్ర ముంచుకువచ్చింది. బెంచిమీద పక్కకు వొరిగాడు. శ్రీనివాసరావుకు తను నిద్రపోతున్నాడో, మెలుకువగా ఉన్నాడో తెలియటంలేదు. ఎక్కడో ఎవరో బాధగా మూల్గుతున్న చప్పుడు విన్పిస్తూనేఉంది. పక్కన తన మామగారు దగ్గడం విన్పిస్తూనే ఉంది. ఎవరో పక్కనుండి బూట్లు టకటక లాడించుకుంటూ వెడుతున్న చప్పుడు విన్పిస్తూనే ఉంది... కాని తను హాస్పిటల్లో లేడు... ఎక్కడో, యెక్కడెక్కడో, యేదో అడవిలో పడి తిరుగుతున్నాడు... అది అడవికాదు... శ్మశానం. తను శ్మశానంలో ఉన్నాడు. తన చుట్టూ తెల్లగా పుర్రెలు, బొమికెలు, అస్థిపంజరాలు, వెర్రిగా భయంకరంగా నృత్యం చేస్తున్నాయి. ఎవరిదో చితి ఎర్రగా మండుతోంది. తను ఎవరిదో శవాన్ని ఈడ్చుకుపోతున్నాడు ఆ చితి దగ్గరకు. ఎవరిదా శవం? అది సుశీల శవం- రక్తం- అంతా రక్తం- తన వంటినిండా రక్తం. తన బట్టల నిండా రక్తం. తను రక్తపుమడుగులో స్నానం చేసి వచ్చాడు. తనంతా రక్తమే- తనచేతిలో కత్తి... ఆ కత్తినిండా రక్తమే- తను హత్య చేశాడు... ఎవరినో కాదు... సుశీలను. తన భార్యనే, తను ఇష్టపడి చేసుకున్న భార్యనే హత్య చేశాడు. సుశీలను తన చేతిలో వున్న కత్తితో నరికాడు. ఇంకా నరుకుతున్నాడు. సుశీలను ముక్కలు ముక్కలుగా నరికివేస్తున్నాడు. సుశీల రక్తాన్ని తన వొంటినిండా పులుముకుంటున్నాడు. శ్మశానమంతా తిరుగు తున్నాడు... ఎగురుతున్నాడు... గంతులు వేస్తున్నాడు. సుశీలను ఎర్రగా మండుతున్న ఆ చితిమీదకు విసిరివేస్తున్నాడు.

ఆ చితి చుట్టూ తిరుగుతున్నాడు. చిత్రం తను వొక్కడే తిరగటం లేదు. తన పక్కన ఎవరో ఉన్నారు. తన పక్కన ఎర్రని బట్టలు కట్టుకొని, మెడలో ఎర్రని పూలదండ వేసికొని ఎవరో యువతి తనతోపాటు సుశీల చితిచుట్టూ తిరుగుతోంది... ఆవిడ ఎవరోకాదు... పెళ్ళికూతురు. తన రెండోభార్య. ఇద్దరూ కొంగులు ముడివేసుకొని చితిచుట్టూ తిరుగుతున్నారు. తమ పక్కనే వందలాది మంది బ్యాండువాళ్ళు విషాద స్వరంతో యేదో చావు సంగీతాన్ని విన్పిస్తున్నారు. ఎవరో నవ్వుతున్నారు. పగలబడి, విరగబడి, కసిగా నవ్వుతున్నారు ఎవరది? ఎవరు తమను చూసి అలా యెగతాళిగా నవ్వేది? సునీతాదేవి, శంకర్రావ్‌లు. సునీతాదేవి వెర్రిగా నవ్వుతోంది. ఉప్పెనలా ముంచుకు వస్తున్న నవ్వులో ఉక్కిరిబిక్కిరై నవ్వుతోంది. ఆ నవ్వుకు ఆవిడ అందమైన, బలమైన వక్షోజాలు సముద్ర కెరటాల్లా పడి లేస్తున్నాయి. తను పిచ్చిగా స్మశానంలో మండుతున్న చితులకేసి చూస్తున్నాడు.

"పెళ్ళి... శ్మశానంలో పెళ్ళా? హంతకుడికి పెళ్ళా? పెళ్ళాన్ని కత్తితో నరికిన వాడికి పెళ్ళా?" అంటూ నవ్వుతోంది సునీతాదేవి. ఔను... తను హంతకుడే-ఇంతకుముందు సుశీలను ముక్కలు ముక్కలుగా నరికి చితిమీదికి విసిరేశాడు. కాని అప్పుడు తనొక్కడే ఉన్నాడు. ఈ విషయం సునీతాదేవికి ఎలా తెల్సింది? ఎవరికీ తెలియదనుకున్నాడు. తనకొక్కడికే తెలుసుననుకున్నాడు. కాని సునీతాదేవికి తెలిసిపోయింది... భయం... విద్యుత్‌లా భయం తన నరనరాల్లో వ్యాపిస్తోంది.

"వీడికి పెళ్ళేమిటి? వీడు హంతకుడు. వీడిని పోలీస్ స్టేషన్‌కు తీసికెళ్ళండి. డి.ఎస్.పి. గారు! వీడు హత్య చేశాడు. వీడ్ని ఉరికంబమెక్కించండి" అంటూ అరుస్తున్నాడు శంకర్రావు.

ఎస్.పి.! ఆరోజు సునీతాదేవి బర్తుడే పార్టీనాడు శంకర్రావు యింటికి కార్లో వచ్చిన ఎస్.పి. తనవేపు వస్తున్నాడు. భయం... గుండెల్ని పట్టి నులిమివేస్తున్న భయం... తను పారిపోవాలి... ఎక్కడికన్నా పారిపోవాలి – లేకపోతే తనను ఉరికంబ మెక్కిస్తారు– కాని కాళ్ళు చేతులు కదలటం లేదు.

తన పక్కనున్న పెళ్ళికూతురు తనను గట్టిగా పట్టుకుని కదలనీయటం లేదు. ఆ పెళ్ళికూతురు అచ్చం సునీతాదేవిలాగే ఉంది. లాగేకాదు. ఆమె సునీతాదేవే!

"మీరు హంతకులా? నన్నింత మోసం చేస్తారా?" అరుస్తోంది సునీతాదేవి.

తనకు పిచ్చెక్కుతున్నది.

"ఔను– నేను హంతకుణ్ణే – నీకు తెలియదూ, సుశీలను నేనే హత్య చేశాను" అహ్హహ్హహ్హా... నవ్వుతున్నాడు. పిచ్చివాడైపోయాడు. శ్మశానంలో గంతులు వేస్తున్నాడు.

పుర్రెలతో ఆడుకుంటున్నాడు. అంతా తనని పిచ్చివాడని, పెళ్ళాన్ని హత్య చేశాడని వెంబడిస్తున్నారు. రాళ్ళతో కొడ్తున్నారు. పిచ్చికుక్కను తరిమినట్టు తరుము తున్నారు. తను అరుస్తున్నాడు- కేకలు వేస్తున్నాడు- యేడుస్తున్నాడు-

"బాబు! బాబూ! యేమిటి అలా కేకలు వేస్తున్నావు" తనను గట్టిగా కదుపుతూ- లేపుతున్నాడు తన మామగారు. శ్రీనివాసరావు బెంచిమీంచి విసురుగా లేచి కూర్చున్నాడు. తను యింతసేపూ కలగంటున్నాడా? ఎంత భయంకరమైన కల! తనలోని తనకు తెలియని తనను స్పష్టంగా చూశాడు- ఎందుకో గుండెలు చాలా తేలికపడ్డట్టనిపించింది. అతనికి అకస్మాత్తుగా సుశీల నొప్పులు పడ్తున్న విషయం జ్ఞాపకం వచ్చింది.

"సుశీల ఎలా ఉంది?" ఆత్రంగా అడిగాడు.

"ఇంకా నొప్పులు పడుతూనే ఉంది" అన్నాడు సుశీల తండ్రి.

శ్రీనివాసరావు దిగ్గున లేచాడు. గబగబా సుశీల ఉన్న రూమ్‌లోకి వెళ్ళాడు. సుశీల అలాగే నొప్పులు పడ్తోంది. పక్కన ఇద్దరు నర్సులు, తన అమ్మా, అత్తా ఉన్నారు.

శ్రీనివాసరావు విసురుగా అన్నాడు :

"మీరంతా బయటికి వెళ్ళి సుశీలతో నన్ను రెండు నిమిషాలు మాట్లాడనిస్తారా!"

వాళ్ళు ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ బయటకెళ్ళారు. సుశీల తనకేసి బాధగా, జాలిగా, బలహీనంగా చూస్తోంది. అతనిలో యేదో వెర్రి ఆవేశం కట్టలు తెంచుకుని ప్రవహించింది.

"నన్ను క్షమిస్తావా సుశీలా! ఈ హంతకుణ్ణి క్షమిస్తావా? నువ్వు చనిపోకూడదు. నువ్వు బతకాలి- బతికి తీరాలి- నువ్వే చనిపోతే నేను పిచ్చివాణ్ణయి పోతాను. నేను చేసిన పాపానికి నేను బలియైపోకుండా ఉండాలంటే నువ్వు బతకాలి. నాకోసం బతకాలి.

నిజంగా నేను హంతకుణ్ణి సుశీలా! నువ్వెప్పుడో అన్నావు చూడు... నువ్వు చనిపోవాలని నేను కోరుకుంటున్నానని - ఔను... ఇన్నాళ్ళూ నువ్వు చచ్చిపోవాలని కోరుకున్నాను. నాలో నాకు తెలియకుండానే ఒక క్రూరజంతువు ప్రవేశించింది. నువ్వు చనిపోవాలని కోరుకున్నాను. నీ ఆరోగ్యాన్ని కావాలనే నిర్లక్ష్యం చేశాను. నువ్వు చనిపోతే ఆ పాపం నాదే సుశీలా! నువ్వు చనిపోతే నన్ను నేను క్షమించుకోలేను. నామీద నాకు కల్గిన ద్వేషంతో, అసహ్యంతో పిచ్చివాణ్ణయిపోతాను, నన్ను పిచ్చివాణ్ణి,

హంతకుణ్ణి చేసి వెళ్ళిపోతావా సుశీలా వద్దు- వద్దు- వద్దు- నువ్వు బతికాలి... బతికితీరాలి"

సుశీల ముందు శ్రీనివాసరావు కుప్పగా కూలిపోయాడు. ఉప్పెనలా పొంగివచ్చిన కన్నీళ్ళ ప్రవాహంతో సుశీలను ముంచెత్తాడు. తనను తాను, ఆ కన్నీళ్ళతో ప్రక్షాళనం చేకున్నాడు. సుశీల కూడా యేడ్చింది. యేదో తృప్తితో యేడ్చింది.

అతని తల నిమురుతూ, "నేనేం చావను - నేను చాలా మొండి ఘటాన్ని మీరు ఊరుకోరూ!" బలహీనంగా అంది సుశీల.

తనను తాను సంభాళించుకుంటూ లేచి నిల్చున్నాడు శ్రీనివాసరావు. కన్నీళ్ళు తుడుచుకుంటూ సుశీలకేసి నిండుగా, ధైర్యంగా చూశాడు. సుశీల కూడా తృప్తిగా అతనికేసి చూసింది. శ్రీనివాసరావు హృదయం మీద నుండి హిమాలయ పర్వతాలే తొలగిపోయాయి.

సుశీలకు నొప్పులు అధికమయ్యాయి. శ్రీనివాసరావు బయటకెళ్ళాడు. ఓ ఐదు పది నిమిషాలు గది బయట గడిపాడు. ఆ తర్వాత పసిపాప యేడ్చిన చప్పుడు... మరోక్షణంలో తలుపు తెరుచుకొని వచ్చిన నర్స్-

"కంగ్రాచ్యులేషన్స్ ఇంజనీర్‌గారు- మీ భార్య ప్రసవించింది- ఆడపిల్ల" అంది.

"సుశీల ఎలా ఉంది సిస్టర్" అన్నాడు.

"షీ ఈజ్ ఆల్‌రైట్ - యిక మీరు యేమీ భయపడాల్సిన అవసరం లేదు" అంది నర్స్.

గుండెలమీద చేయివేసికొని దీర్ఘంగా నిట్టూర్చాడు శ్రీనివాసరావు.

"నాలో ప్రవేశించిన క్రూర జంతువును సంహరించుకోగల్గాను" అనుకున్నాడతడు.

'ప్రగతి' వీక్లీ *(1971)*

*(నేపథ్యం : ప్రతి పురుషుడి అంతశ్చేతనలో ఒక స్త్రీతో కాకుండా చాలా మంది స్త్రీలతో సంబంధం పెట్టుకోవాలన్న కోరిక దాగి ఉంటుందట. ఈ కథలోని ప్రధాన పాత్ర శ్రీనివాసరావుకూ అందమైన తన స్నేహితుడి భార్యను చూసినప్పుడు అలాంటి కోరిక కల్గుతుంది. ఫ్రాయిడ్ మనో విశ్లేషణా సూత్రాల ప్రభావం ఈ కథ మీద ఉంది. ఒక మిత్రుడు జరుపుకుంటున్న అతని భార్య బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్ళినప్పుడు అతని భార్య చూసిన ఒక చూపు నాచేత ఈ కథను రాయించింది.)*